

రోడ్ల నిర్మాణాలపై దృష్టి పెట్టండి : కలెక్టర్

భీమవరం :ప్రజా ప్రయోజనాలకు తొలి ప్రాధాన్యతిస్తూ రహదారుల నిర్మాణాలు తక్షణం చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖ ఇంజనీరింగ్ అధికారులతో జిల్లాకు మంజూరైన రోడ్ల నిర్మాణాలపై సమీక్షించారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి పరిధిలో చేపట్టిన, చేపట్టాల్సిన రహదారులు, కల్వర్టుల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలన్నారు. జిల్లాలోని కొన్ని ప్రదేశాల్లో రోడ్లు పెద్దఎత్తున మరమ్మతులకు గురయ్యాయని వాటి నిర్మాణాలకు తగుచర్యలు తీసుకోవాలన్నారు. ఆర్అండ్‌బి శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రాధాన్యత భవనాలను త్వరితగతి పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే నిర్మాణాలు పూర్తి చేసుకున్న మంచిలి, లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. అలాగే ఆచంట, మేడపాడు పిహెచ్‌సిల ఫినిషింగ్ పనులను పూర్తి చేసి జిల్లా వైద్యశాఖకు అప్పగించాలన్నారు. జ్యుడిషియల్ క్వార్టర్స్ మరమ్మతు పనులను వేగవంతం చేయలన్నారు.

నా'నో'..!



నానో యూరియాపై రైతులు విముఖత

సొసైటీ, రైతుభరోసా కేంద్రాల్లో బలవంతంగా అంటగట్టేందుకు యత్నం

ఎరువుల సబ్సిడీ నుంచి తప్పకునేందుకు మోడీ సర్కార్ కుట్ర

శాస్త్రీయంగా నిరూపణ కాకుండానే మార్కెట్‌లోకి

రెండేళ్లలో జిల్లాలో 7,070 నానో బాటిల్స్ మాత్రమే కొనుగోలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రైతులకు అందిస్తున్న ఎరువుల సబ్సిడీ నుంచి తప్పుకునేందుకు కేంద్రం కుటిల యత్నాలు చేస్తోంది. అందులో భాగంగానే శాస్త్రీయంగా నిరూపణ కాని నానో యూరియాను రైతులపై బలవంతంగా రుద్దేందుకు మోడీ సర్కార్ ప్రయత్నిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను గుడ్డిగా సమర్థిస్తూ రైతులను ఇబ్బంది పెడుతున్నారు. నానో యూరియా సక్రమంగా పనిచేయడం లేదంటూ రైతులు పెదవి విరుస్తున్నారు. వ్యవసాయ రంగంలో యూరియా వాడకానికి ప్రత్యేకత ఉంది. జిల్లాలో అత్యధికంగా వరి, మొక్కజొన్న, ఆయిల్‌పామ్, పొగాకు వంటి పంటలను రైతులు సాగుచేస్తున్నారు. యూరియా వాడకం జిల్లాలో పెద్దఎత్తున ఉంటుంది. యూరియా ఎరువు పలుకులుగా ఉంటుంది. 45 కిలోల బస్తా ఖరీదు రూ.266 వరకూ ఉంది. యూరియాను ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు అందిస్తూ ఉంటుంది. మోడీ సర్కార్ వచ్చాక కాంప్లెక్స్ ఎరువుల ధరలను విపరీతంగా పెంచింది. యూరియా సబ్సిడీని ఎత్తివేస్తే రైతులనుంచి వ్యతిరేకత వస్తుందని భావించి, నానో యూరియాను తెరపైకి తెచ్చింది. ఇది లిక్విడ్ రూపంలో ఉంటుంది. యూరియాను రైతులు ఖరీఫ్‌లో ఎకరాకు బస్తాన, దాళ్వాకు మూడుబస్తాల వరకూ వాడతారు. పంట ఏపుగా పెరగడానికి యూరియా ఎరువు కీలక పాత్ర పోషిస్తోంది. యూరియా స్థానంలో బస్తాకు 500 మిల్లీలీటర్లు చొప్పున నానో యూరియా వాడేవిధంగా రూపొందించినట్లు చెబుతున్నారు. నానో యూరియా అరలీటర్ ఖరీదు రూ.240 వరకూ ఉంది. దీన్ని బలవంతంగా రైతులకు అంటగట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. సొసైటీలు, రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు అంటగట్టేందుకు చూస్తున్నారు. 2021-22లో 1,176 అరలీటర్ బాటిళ్లు, 2022-23లో 3,648 బాటిళ్లు, ప్రస్తుత ఖరీఫ్‌లో 2,246 బాటిళ్లను మాత్రమే సొసైటీలు, రైతుభరోసా కేంద్రాల ద్వారా విక్రయించారు. కాంప్లెక్స్ ఎరువులు కావాలంటే నానో యూరియా బాటిల్ తీసుకోవాలంటూ నిబంధన పెట్టి మరీ పలుచోట్ల అంటగడుతున్నారు. తీసుకువెళ్లిన రైతులు వాడినా పెద్దగా ఫలితం లేకపోవడంతో దీన్ని కొనుగోలు చేసేందుకు ఇష్టపడటం లేదు. పలుకులతో కూడిన యూరియానే బాగా పనిచేస్తుందని రైతులు చెబుతున్నారు. సబ్సిడీ నుంచి తప్పుకునేందుకు నానో డిఎపిని కూడా కేంద్రం తెచ్చిన పరిస్థితి ఉంది. ఇది ఇంకా జిల్లాలోకి రాలేదని తెలుస్తోంది. నానో యూరియా వల్ల చాలా ఉపయోగాలున్నాయంటూ ఆయాశాఖల అధికారులు చెబుతున్నారు. శాస్త్రీయంగా నిరూపితంకాని నానోయూరియా వల్ల ఉపయోగాలున్నాయని ఏ విధంగా చెబుతారన్న ప్రశ్న అందరినీ వేధిస్తోంది. నానో యూరియాను వాడేందుకు రైతులు ససేమిరా అంటున్నారు. శాస్త్రీయంగా నిరూపితం కాని నానో యూరియాను రైతులకు ఇవ్వాలని చూడటంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైతులు ముందుకు రాకపోవడంతో అధికారులకు ఏంచేయాలో తెలియక మదనపడుతున్నారు. నానో యూరియాను శాస్త్రీయంగా నిరూపితమైన తర్వాత మార్కెట్లోకి తీసుకురావాలే తప్ప బలవంతంగా అంటగట్టకూడదని రైతులు అంటున్నారు.

సంతకాలు సేకరిస్తూ.. కరపత్రాలు పంచుతూ

జిల్లావ్యాప్తంగా కొనసాగిన సిపిఎం సమరభేరి ప్రచారయాత్రలు

ప్రజాశక్తి - యంత్రాంగం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ గతనెల 28వ తేదీ నుంచి ఈనెల నాలుగో తేదీ వరకూ చేపట్టనున్న సిపిఎం చేపట్టిన 'సమరభేరి'లో భాగంగా గురువారం జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు కొనసాగాయి. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో సిపిఎం నేతలు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. అనంతరం ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. పలుచోట్ల ధర్నా చేపట్టారు.

భీమవరం:కేంద్రంలో బిజెపిని, రాష్ట్రంలో వైసిపిని వచ్చే ఎన్నికల్లో ఇంటికి సాగనంపాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, నాయకులు ఎం.వైకుంఠరావు పిలుపునిచ్చారు. స్థానిక 12వ వార్డు టౌన్‌షిప్‌లో రెండో రోజు సిపిఎం సమరభేరి ప్రచార యాత్రలో భాగంగా సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం



భీమవరంలో..

తొమ్మిదేళ్ల పాలనలో పేదలపై మోయలేని భారాలు మోపిందన్నారు. కార్పొరేట్లకు రూ.లక్షల కోట్లు రాయితీలు ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చైతన్య ప్రసాద్, డి.త్రిమూర్తులు, కె.కృష్ణ, డి.నాగు, రేణుక, మంగ, అనసూయమ్మ, కేత శీను, నల్ల బద్రమ్మ, కె.నాగలక్ష్మి, నాగమణి పాల్గొన్నారు.

తణుకు : విద్యుత్ సంస్కరణలను రాష్ట్రంలో అమలు చేయడం వల్ల కరెంట్ ఛార్జీలు భారీగా పెరిగాయని సిపిఎం జిల్లా నాయకులు అడ్డగర్ల అజయ కుమారి అన్నారు. సిపిఎం 'సమర భేరి' కార్యక్రమం కొమ్మాయి చెరువు గట్టు, ఇరగవరం కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై ప్రచురించిన కరపత్రా లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గార రంగారావు, మూర్తి, వెంకటేశ్వర రావు, బ్రహ్మాజీ, చిన్నారావు, సురేష్ పాల్గొన్నారు.

అత్తిలి : సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో అత్తిలిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ వి.రాంబాబు, నాయకులు క్రరి ధర్మేంద్ర విజయకుమార్, సూరిబాబు పాల్గొన్నారు.

ఆచంట : ప్రధాని నరేంద్ర మోడీ కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా దేశ సంపదను దోచిపెడుతు న్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ విమర్శించారు. సిపిఎం సమరభేరిలో భాగంగా ఆచంటలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి నరసింహారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు వద్దిపర్తి అంజిబాబు, కుసుమే జయరాజు, నాయకులు వద్దిపర్తి శ్రీనివాసరావు, కొండేటి సత్యనారాయణ, పద్మారావు, బ్రహ్మయ్య, సూర్యనారాయణ పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం మండలంలో..

తాడేపల్లిగూడెం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై పెనుభారాలు మోపుతున్నాయని సిపిఎం పట్టణ కార్యదర్శి క్రరి నాగేశ్వరరావు విమర్శించారు. సిపిఎం సమరభేరిలో భాగంగా స్థానిక యాగర్లపల్లి, రామచంద్రరావు పేటలో ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేస్తూ, సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీను, పోతు శ్రీను, శిద్దిరెడ్డి శేషుబాబు, తంగేటి శ్రీను, పతివాడ నాగేంద్రబాబు, యడవల్లి వెంకన్న, కొమ్మిరెడ్డి ఉదయ్, తోట శ్రీను, గొర్లి సత్తిబాబు, షేక్ సాయిబన్ పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించి, నిత్యవసర ధరలను అదుపుచేయాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వెంప గ్రామంలో సిపిఎం సమరభేరిలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేగి ప్రసాద్, కుర్ర, మోహన్‌రావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్ : నిత్యావసర సరుకుల ధరలను తగ్గించడంలో, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలోను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబూరావు విమర్శించారు. సిపిఎం సమరబేరిలో భాగంగా భాగంగా మాధవరం గ్రామంలో ప్రజాసమస్యలపై సంతకాల సేకరణ చేపట్టారు. ముఖ్యఅతిథిగా చింతకాయల బాబూరావు మాట్లాడారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటి ప్రజలకు పెనుభారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఈ నెల నాలుగో తేదీన తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కండెల్లి సోమరాజు, నాయకులు గ్రామ శాఖ కార్యదర్శి పురిటి గడ్డ జయమ్మ, గుత్తుల నరసయ్య, గోపాల వెంకటరావు, మంచాల పాపమ్మ, మల్లుల పరమేశు, గుత్తుల సత్యవతి, మంద రామారావు పాల్గొన్నారు.

పెనుగొండ : నిత్యావసరాల ధరల అదుపులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని సిపిఎం మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. సిపిఎం సమరభేరి కార్యక్రమాన్ని పెనుగొండలోని కోడిపందేల దిబ్బ ప్రాంతంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు షేక్ పాదుషా, కడిమి పెళ్లికొడుకు, మాదాసు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాళ్ల : కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని సిపిఎం ప్రాతళ్లమెరక శాఖ కార్యదర్శి తిరుమాని శ్రీనివాస్ అన్నారు. గ్రామంలో సిపిఎం సమర భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో దాసి లాజరు, చాట్ల ఏసురత్నం, దాసి బాలయ్య, రవి పాల్గొన్నారు.

పాలకొల్లు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ ఛార్జీలను ఇష్టానుసారంగా పెంచి సామాన్య మధ్యతరగతి ప్రజలపై పెనుభారాలు వేస్తున్నాయని మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ అన్నారు. సిపిఎం సమరభేరి నిరసన కార్యక్రమం పట్టణంలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు, చల్లా సోమేశ్వరరావు, రోజామణి, తిరుమాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యలమంచిలి : సిపిఎం సమర భేరి కార్యక్రమం చించినాడలో పార్టీ మండల కార్యదర్శి కానేటి బాలరాజు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు బాతిరెడ్డి జార్జి, గొల్ల ఏడుకొండలు, చెల్లుబోయిన వడ్డీ కాసులు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సమరభేరిలో భాగంగా స్థానిక 22వ వార్డులో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పొగాకు పూర్ణ, పట్టణ కమిటీ సభ్యులు పొన్నాడ రాము, కోరాడి పార్వతి, పొన్నాడ మల్లేశు, లక్ష్మీనారాయణ, కొండ, భూషణం, రాము పాల్గొన్నారు.

యువగళం @ 200 రోజులు

2,700 కిలో మీటర్లు దాటిన పాదయాత్ర


సీతంపేటలో పైలాన్ ఆవిష్కరణ

పాల్గొన్న తల్లి భువనేశ్వరి, నారా, నందమూరి కుటుంబ సభ్యులు

కొయ్యలగూడెంలో గిరిజనులతో ముఖాముఖీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి/కొయ్యలగూడెం

టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర గురువారం 200 రోజులు, 2,700లోమీటర్లు పూర్తిచేసుకుంది. ఈ సందర్భంగా కొయ్యలగూడెం మండలం సీతంపేటలో పైలాన్‌ను ఆవిష్కరించారు. ఈ యాత్రలో లోకేష్ తల్లి భువనేశ్వరితో పాటు నారా, నందమూరి కుటుంబ సభ్యులు పాల్గొని నడిచారు. పోలవరం నియోజకవర్గం కొయ్యలగూడెం మండలంలో యువగళం యాత్ర ఉత్సాహంగా ముందుకు సాగింది. గిరిజన మహిళలు లోకేష్‌కు రాఖీలు కట్టారు. దారిలో జనాన్ని పలకరిస్తూ, కరచాలనం చేస్తూ, ఫొటోలు దిగుతూ లోకేష్ ముందుకు సాగారు. ఈ సందర్భంగా నరసన్నపాలెం, బయ్యనగూడెం గ్రామస్తులు తమ సమస్యలపై లోకేష్‌ను కలిసి వినతిని అందించారు. టిడిపి అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తామని లోకేష్ వారికి హామీ ఇచ్చారు. అనంతరం కొయ్యలగూడెంలో గిరిజనులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులతో లోకేష్ కొద్దిసేపు నృత్యం చేశారు. అనంతరం గిరిజన నాయకుడు వెంకటప్ప గిరిజనులు


గిరిజన మహిళలతో లోకేష్

ఎదుర్కొంటున్న పలుసమస్యలను లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన మాట్లాడుతూ వంద రోజుల పాదయాత్ర సందర్భంలో చెంచులతో, 200 రోజులు పాదయాత్ర పూర్తి చేసుకున్న సందర్భంగా పోలవరంలో గిరిజనులతో సమావేశం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. గిరిజనులను ఆర్థికంగానూ, రాజకీయంగానూ ఉన్నతస్థితికి తీసుకురావడానికి టిడిపి ఎంతో కృషి చేసిందన్నారు.

ఓటర్ల సవరణ పారదర్శంగా చేపట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కాళ్ల

ఓటర్ల సవరణ ప్రక్రియ పారదర్శంగా జరగాలని, తొలగింపులు, చేర్పులు, మార్పుల జాబితాలు ఆయా సచివాలయాల్లో డిస్‌ప్లే చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. గురువారం సీసలి, ఏలూరుపాడు గ్రామ సచివాలయాల్లో జిల్లా కలెక్టరు ప్రశాంతి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తొలగింపులు, మార్పులు, చేర్పులు జాబితాల రిజిస్టర్లను, కంప్యూటర్ డేటాను పరిశీలించి అధికారులకు జిల్లా కలెక్టరు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. పోలింగ్ బూత్ స్థాయి అధికారులు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునే వారి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. ఓటరు నమోదు, తొలగింపు ప్రక్రియలో బూత్ స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. 1500 ఓటర్లు కంటే ఎక్కువ మంది ఉంటే పోలింగ్ స్టేషన్ పరిధిలో కొత్త పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఓటర్ల జాబితాల వారీగా పోలింగ్ కేంద్రాలు పునర్విభజన ప్రక్రియ అత్యంత పకడ్బందీగా చేయాలన్నారు. సెప్టెంబరు నెలాఖరు నాటికి పోలింగ్ కేంద్రాల పునర్విభజన కార్యక్రమం పూర్తిచేయాల్సి ఉందన్నారు. మండలంలోని 62 పోలింగ్ స్టేషన్లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని తహశీల్దార్ కృష్ణారావును జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ టిఎ కృష్ణారావు, బిఎల్ఒలు, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


ఏలూరుపాడు సచివాలయంలో బిఎల్ఒలతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

మొక్కుబడి శిక్షణతో పనిచేసేదెలా

పిహెచ్‌సి వద్ద ఆశా వర్కర్ల ధర్నా

ప్రజాశక్తి - వీరవసరం

మొక్కుబడి శిక్షణలతో ఆశా వర్కర్లు ఎలా పనిచేస్తారని సిఐటియు మండల కమిటీ ఆక్షేపణ వ్యక్తం చేసింది. గురువారం వీరవాసరం పిహెచ్‌సిలోని ఆశా వర్కర్ల ట్రెయినింగ్ క్యాంపు వద్ద ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడారు. ఆశా వర్కర్లకు శిక్షణ అంటే ప్రజల్లో ఆరోగ్య సమస్యలపై పని చేయడానికి కావాల్సిన తర్ఫీదు అందించాల్సి ఉందని తెలిపారు. దానికి అన్ని రకాల వసతులూ కల్పించి శిక్షణా కేంద్రం నిర్వహించాలని అన్నారు. కానీ వీరవాసరంలో 26 రోజులుగా శిక్షణ పొందుతున్న ఆశా వర్కర్లకు శిక్షణ కేంద్రంలో వసతులు కల్పించడంలో ప్రభుత్వం శ్రద్ధ వహించకపోవడం దారుణమన్నారు. ఏరోజు కారోజు శిక్షణా కేంద్రానికి రావడానికి ఒక్కొక్కరికీ సుమారు మూడు వేల రూపాయలు ఖర్చయ్యిందని, కనీసం ఆ ఖర్చులు ఇవ్వడానికి కూడా ప్రభుత్వం శ్రద్ధ చూపలేదని అన్నారు. ఏ రోజుకు కారోజు ఇంటికి వెళ్లి రావడం వల్ల శిక్షణ సరిగ్గా పొందడానికి అవకాశం ఉండదన్నారు. శిక్షణ పొందుతున్న సమయంలో భోజనం, టీ, టిఫిన్ ఇతర సదుపాయాలు కూడా సక్రమంగా లేకపోవడం వల్ల ఆశా వర్కర్లు అనేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. జిల్లాలో ఆశా వర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు తదితర ఉద్యోగులు శిక్షణ పొందేందుకు వసతి కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు వాటి నిర్వహణకు తగినన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు చింతపల్లి లక్ష్మి మాట్లాడుతూ 26 రోజులుగా శిక్షణ పొందిన ఆశా వర్కర్లకు ప్రయాణ ఖర్చులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రకరకాల యాప్‌లు పెట్టి ఆన్‌లైన్ వర్క్ పేరుతో ప్రజల్లోకి వెళ్లనీయకుండా పనిచేస్తోందన్నారు. పని ఒత్తిడి తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు లారెన్స్ కుమారి, వరలక్ష్మి, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఆశాలు

ముగిసిన దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్

ప్రజాశక్తి - ఆచంట

ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్ ద్వారా దస్తావేజులను రిజిస్ట్రేషన్ చేయడానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా దస్తావేజు లేఖర్లు గురువారం పెన్‌డౌన్ కార్యక్రమం చేపట్టారు. ఈ నేపథ్యంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్మానుష్యంగా మారాయి. ఈ సందర్భంగా ఆచంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్లు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కెసి.రాజు, సాంబశివరావు, హరి, సూర్యప్రకాష్, యడ్లపల్లి నారాయణరావు, రుద్రరాజు, చిట్టిరాజు సుధీర్ పాల్గొన్నారు.

ఆకివీడు :'మా పొట్ట కొట్టొద్దంటూ దస్తావేజు లేఖరులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. దస్తావేసు లేఖర్లు చేపట్టిన పెన్‌డౌన్ కార్యక్రమం రెండో రోజు గురువారం కొనసాగింది. తరువాత కార్యక్రమం రాష్ట్ర సంఘం పిలుపుమేరకు చేస్తామని లేఖరులు తాడేపల్లి జితేంద్ర, ఎండపల్లి సుబ్బారావు తెలిపారు. నూతన విధానంలో కక్షిదారుల చేతికి దస్తావేజులు దక్కకపోవడం ఇక్కడ ప్రధానాంశమని తెలిపారు. కార్యక్రమంలో లేఖర్లు గుడిపాటి వెంకటేశ్వరరావు, తాడేపల్లి అనిల్, వేము పాండురంగారావు, ఎస్.సతీష్, టి.వెంకట్, సత్యనారాయణ, ఆదూరి మురళీకృష్ణ, మాధవి, రమ్య పాల్గొన్నారు.


ఆకివీడు : ఆందోళన చేస్తున్న దస్తావేజు లేఖర్లు


మొగల్తూరు : మొగల్తూరులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్లు చేపట్టిన పెనౌడౌన్ కార్యక్రమం గురువారం కూడా కొనసాగింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న కార్డ్ ఫ్రేమ్ 2.0కు వ్యతిరేకంగా దస్తావేజు లేఖర్లు చేపట్టిన పెన్‌డౌన్ కార్యక్రమంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కొల్లాటి వెంకటేశ్వరరావు, శిలబోయిన సత్యనారాయణ, పట్టపు రాము, రాజేష్, కడలి శేఖర్, గుండు నాగేంద్ర పాల్గొన్నారు.

ఉండి : ఉండిలో దస్తావేజు లేఖర్ల నిరసన గురువారం రెండో రోజుకు చేరింది. పలువురు దస్తావేజు లేఖర్లు మాట్లాడుతూ దస్తావేజు లేఖర్ల పట్ల ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. ఇదే వృత్తిని నమ్ముకుని ఎన్నో ఏళ్లుగా లక్షలాదిమంది జీవనం సాగిస్తుండగా వారిని రోడ్డుపై పడేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చే 2.0 విధానాన్ని రద్దు చేయాలని లేని పక్షంలో దస్తావేజు లేఖర్లు, సహాయకులు, డిటిపి ఆపరేటర్లు, స్టాంప్ వెండర్లందరూ ఐక్యంగా ఉద్యమిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖరులు, సహాయకులు, స్టాంప్ వెండర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి - ఉండి

తూనికలు, కొలతలు శాఖ కార్యాలయానికి అవసరమయ్యే స్థలాన్ని పరిశీలించేందుకు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి మండలంలో గురువారం పర్యటించారు. మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారంలోని పౌర సరఫరాల శాఖ గోదాములను పరిశీలించారు. స్థలంతో పాటు మ్యాపులను కూడా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. స్థల పరిశీలనలో తూనికలు, కొలతల శాఖ అధికారి నాగరాజారావు, ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎస్.వీరాస్వామినాయుడు, మండల సర్వేయర్ రత్నావళి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు. అయితే ఈ విషయంపై స్థానికుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా విభజన అనంతరం పశ్చిమగోదావరి జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి కార్యాలయాన్ని మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారం సివిల్ సప్లై గోదాములోనే ప్రారంభించారని, కానీ అనతి కాలంలోనే భీమవరం ప్రాంతంలోకి మార్చేశారని, ఈ విధంగా మార్చేటప్పుడు ఉండి మండలంలో మరొక ప్రభుత్వ కార్యాలయానికి స్థల పరిశీలన అవసరమా అని స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు.


అధికారులకు సూచనలు చేస్తున్న జెసి రామ్ సుందర్ రెడ్డి

తాడేపల్లిగూడెం:గురువారం తాడేపల్లిగూడెం పురపాలక సంఘం పరిధిలోని గణేష్‌నగర్‌లో తూనికల కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ కార్యాలయ భవన నిర్మాణానికి 4.50 సెంట్ల భూమిని జిల్లా జాయింట్ కలెక్టరు పరిశీలించారు. స్థల పరిశీలన చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఇందుకు సంబంధించి భూ మ్యాప్‌లను పరిశీలించి, భూ పరిసరాలను జెసి ఎస్.రామ్‌సుందర్ రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. జెసి వెంట తహశీల్దారు వై.దుర్గాకిషోర్, సర్వేయర్ ఆర్.రామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది, పాల్గొన్నారు.

రామాలయాల అభివృద్ధికి నిధులు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఆచంట

గ్రామీణ ప్రాంతాల్లో రామాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక నిధులు కేటాయిస్తోందని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. కొడమంచిలి పంచాయతీ పరిధి టి.మెరకలో రూ.5 లక్షలతో నూతనంగా నిర్మించిన రామాలయాన్ని ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొడమంచిలి అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని తెలిపారు. త్వరలో కొడమంచిలి పంచాయతీ కార్యాలయం నుంచి టి.మెరక వరకూ రోడ్డు నిర్మించనున్నామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరిందని, ముఖ్యమంత్రికి అంతా అండగా ఉండాలని కోరారు. అనంతరం దళిత సంఘం ఆధ్వర్యంలో చెరుకువాడ శ్రీరంగనాథరాజును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎఎంసి ఛైర్మన్ మాజీ ఛైర్మన్ సుంకర ఇందిరా సీతారామ్, ఎంపిటిసి సభ్యులు యల్లమెల్లి బేబీ ఎంఎల్ఎకు రాఖీలు కట్టి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్, ఎంపిటిసి యల్లమెల్లి బేబీ రాజేష్, వైసిపి ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు కొండేటి రమేష్, రైతు సంఘం అధ్యక్షులు మన్నె సుబ్బారావు, దేవస్థానం అధ్యక్షులు బాలనాగు నరేష్ పాల్గొన్నారు.





మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రజల మన్ననలు పొందాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

సొంత గ్రామాన్ని సిఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేసి ప్రజల మన్నలను పొందాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో సిఎస్ఆర్ (కార్పొరేటు సోషల్ రెస్పాన్స్) నిధుల వినియోగంపై పారిశ్రామిక, ఆక్వా వేత్తలు, సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. గతేడాది సిఎస్ఆర్ నిధులతో ఆశించినంతగా పనులు జరగలేదన్నారు. ఈ ఏడాది పారిశ్రామిక, ఆక్వా వేత్తలు ఉత్సాహంగా ముందుకు రావాలన్నారు. ఆదాయంలో 2 శాతం సిఎస్ఆర్ కింద అభివృద్ధి కార్యక్రమాలు తప్పనిసరిగా చేయాలన్నారు. గేల్స్ అథారిటీ వారికి ఈ ఏడాది రూ.కోటీ 30 లక్షలు సిఎస్ఆర్ కింద పనులు చేపట్టాలని ప్రదిపాదనలు పంపించామన్నారు. ఆంధ్రా షుగర్స్ నుంచి రూ.10 లక్షలు, వాన్‌బేర్రి కంపెనీ రూ.లక్ష సిఎస్ఆర్ కింద డిపాజిట్ చేసినట్లు తెలిపారు. ఒఎన్‌జిసి రూ.70 లక్షలు, వసుధ ఫౌండేషన్ స్కూల్ అభివృద్ధికి చేసేందుకు రూ.60 లక్షలు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఉయ్యాల ఆదిశేషు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ టి.త్రినాధరావు, పొల్యూషన్ బోర్డు ఇఇ కె.వెంకటేశ్వరరావు, సిపిఒ కె.శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డి.మహేశ్వరరావు, డిఇఒ ఆర్.వెంకటరమణ పాల్గొన్నారు.



పాదయాత్ర చేస్తున్న టిడిపి నేతలు

లోకేష్‌కు సంఘీభావంగా పాదయాత్ర

ప్రజాశక్తి - వీరవాసరం

నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర రెండు వందల రోజులు పూర్తయిన సందర్భంగా మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం సంఘీభావ పాదయాత్ర నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు కొల్లేపర శ్రీనివాసరావు, వీరవల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పాదయాత్ర నందమూరుగరువు అంజనేయస్వామి గుడి నుండి వీరవాసరం తూర్పుచెరువు సెంటర్ వరకూ సాగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయం ఖాయం అంటూ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మెంటే పార్థసారధి, వీరవల్లి చంద్రశేఖర్, మళ్ల శ్రీరామ్మూర్తి, రాయపాటి వెంకట్, కడలి నెహ్రూ, కడలి వాసు, అడిదెల చిరంజీవి పాల్గొన్నారు.

మొగల్తూరు: మండలంలో చేపట్టిన యువగళానికి మద్దతుగా చేపట్టిన పాదయాత్ర వెలవెలబోయింది. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో పాదయాత్రకు మద్దతుగా మండలంలోని కొత్తోట గ్రామంలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నుండి ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం వరకు పాదయాత్ర చేపట్టారు. అభిమానులు, కార్యకర్తలు తక్కువ సంఖ్యలో హాజరవ్వడంతో ఈ యాత్ర వెలవెలబోయింది.

అవసరాలకు వెన్నుదన్ను ఎల్ఐసి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

67 సంవత్సరాలుగా భారతదేశ ఆర్థిక వ్యవస్థకు, దేశ ప్రజల బీమా అవసరాలకు వెన్నుదన్నుగా నిలిచి ఎల్ఐసి విస్తరించిందని ఎల్ఐసి ఉద్యోగ సంఘం నాయకులు గరికపాటి బాపయ్య శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1956 సెప్టెంబర్ 1న అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ రూ.ఐదు కోట్ల పెట్టుబడితో ఎల్ఐసిని జాతీయం చేయగా, ఈనాడు సుమారు రూ.44 లక్షల కోట్ల ఆస్తులతో దేశంలోనే అగ్రగామి ఆర్థిక సంస్థగా ఎదిగి, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఏటా లక్షల కోట్ల నిధులు ఎల్ఐసి అందిస్తుందని తెలిపారు. ఎల్ఐసిని కేంద్ర ప్రభుత్వ సంస్థగా కొనసాగించాలని, ప్రయివేటీకరణ, వాటాల అమ్మకం నిలుపుదల చేసి, 30 కోట్ల పట్టాదారులకు మరింత మెరుగైన సేవలందించేలా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. బీమా ప్రీమియంపై జిఎస్‌టి తొలగించితే మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ బీమా మరింత అందుబాటులో ఉంటుందని తెలిపారు.

రాయకుదురు హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ


ప్రజాశక్తి - వీరవాసరం

రాయకుదురు జిల్లా పరిషత్‌కు ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థినులు వివిధ పోటీల్లో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చి అవార్డులు పొందారు. ఈ మేరకు గురువారం ప్రధానోపాధ్యాయుడు కానుకొలను శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు బహు మతులు పొందిన విద్యార్థులను అభినందించారు. యనిసేఫ్, సెర్ట్ ఆధ్వర్యంలో విజయవాడ అలంకార్ హోటల్ వద్ద 28, 29, 30 తేదీల్లో నిర్వహించిన స్కూల్ ఇన్నోవేటీవ్ ప్రోగ్రాం ఎంపికైన ఎం.కీర్తన, గుడాల సంహితసిరి, గైడ్ టీచర్ కె.సూర్యవాణి బృందం కన్సలేషన్ బహుమతి రూ.పది వేలు గెలుచుకున్నారు. అలాగే తెలుగు భాషా దినోత్సవాన్ని పురష్కరించుకుని జిల్లాస్థాయి కథల పోటీల్లో పంజా బాల శ్రీలక్ష్మి ప్రథమ, పుచ్చకాయల వెన్నెల ద్వితీయ బహుమతులు పొందారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గజేంద్రగట్కార్, శేఖర్, వి.సుబ్బరాజు, వీరవల్లి నాగేశ్వరరావు, అంగర వేణు పాల్గొన్నారు.

సాగుభూమిని ఆధార్‌తో అనుసంధానం చేయాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం



జాయింట్ కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి


ప్రతి రైతూ తమ పంట భూమిని ఆధార్‌తో అను సంధానం చేసుకోవాలని తద్వారా పిఎం కిసాన్ లబ్ధి చేకూరుతుందని జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్.రామ్‌సుందర్ రెడ్డి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పిఎం కిసాన్ కింద ప్రతి రైతుకూ తమ పంట భూమి, ఆధార్‌తో అనుసంధానంపై వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ పిఎం కిసాన్ కింద ప్రతి రైతుకూ తమ పంట భూమి, ఆధార్‌తో అనుసంధానం చేయించాలని, చేసుకుంటేనే పిఎం కిసాన్ లబ్ధి చేకూరుతుందన్నారు. జిల్లాలోనీ ప్రతి మండలంలో ప్రతి రైతూ తమ పంట భూమితో ఆధార్ తో లింక్ అయ్యేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ అధి కారులు పాల్గొన్నారు.

తొలగించిన ఓట్లు పరిశీలన : జిల్లా కలెక్టర్

జిల్లాలో తొలగించిన ప్రతి ఓటునూ పరిశీలించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గురువారం కలెక్టర్‌లో స్పెషల్ సమ్మరీ రివిజన్ - 2024లో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వేపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సెప్టెంబర్ 1 నుండి నిర్వహించే రేషన్‌లైజేషన్ ప్రక్రియలో రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో జెసి ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, వైసిపి నాయకులు కామన నాగేశ్వరరావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం



పర్యావరణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

వినాయక చవితి పండుగ సందర్భంగా వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. అన్ని శాఖల అనుమతులు ఒకే చోట పొందేందుకు ఆయా మున్సిపాల్టీల్లో సింగిల్ విండో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారుచేసిన వినాయక ప్రతిమలు పూర్తిగా నిషేధించడం జరిగిందని, నిబంధనలు మీరితే సంబంధిత వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్లో ఎపి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక చతుర్థి జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ ప్రశాంతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలకులోబడి విగ్రహాల తయారీ, నిమర్జనం కార్యక్రమాలు ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు తయారీ, అమ్మకాలు నిషేధం అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా తయారు చేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. 100 విగ్రహాలు పైబడి తయారు చేసేవారు కచ్చితంగా రిజిస్ట్రేషన్ చేసుకుని, ట్రేడ్ లైసెన్స్ పొందాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల కారణంగా జలవనరులు, పర్యావరణం, జల వనరుల్లో ఉండే ప్రాణులకు పెద్ద ఎత్తున నష్టం జరుగుతుందన్నారు. మట్టి విగ్రహాలను మాత్రమే వాడాలన్నారు. గణేష్ ఉత్సవాల మండపాలకు అనుమతులు ఇచ్చేటప్పుడు తగిన రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. బాణాసంచా కాల్చడం, పెద్ద పెద్ద శబ్దాలతో మైకులను ఏర్పాటు చేయడం వంటివి చేయకూడదన్నారు. వినోద కార్యక్రమాల్లో అశ్లీలత, డాన్సులు లేకుండా సాంప్రదాయబద్ధంగా ఉండాలన్నారు. విగ్రహాల తయారుచేసే ప్రదేశాలపై పోలీస్, రెవెన్యూ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు తనిఖీలు ఉంటాయన్నారు. మండపాలకు అనుమతులు ఇచ్చేటప్పుడు పంచాయతీ కార్యదర్శి, మున్సిపల్ కమిషనర్లు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి అనుమతులు ఇవ్వాలన్నారు. రహదారులకు అడ్డంగా ఎట్టి పరిస్థితుల్లో విగ్రహాల ఏర్పాటు చేయకూడదన్నారు. నిమర్జనాల సమయంలో ఎట్టి పరిస్థితుల్లో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ముందుగానే ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. మున్సిపల్, పరిశ్రమలు శాఖలు పెద్ద ఎత్తున మట్టి విగ్రహాలను పంపిణీ చేయాలన్నారు. నిమజ్జనాల రోజుల్లో వివిధ కూడళ్లలో మెడికల్ క్యాంపులు, అంబులెన్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని పంచాయతీల్లో, మున్సిపాల్టీలో పర్యావరణ విగ్రహాల తయారీ, వినియోగాలపై అధికారులతో సమావేశాలను ఏర్పాటుచేసి అవగాహన, చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, ఎపి పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.వెంకటేశ్వరరావు, డిపిఒ జివికె.మల్లికార్జునరావు, డిఇఒ ఆర్.వెంకటరమణ, డిఐఒ వి.ఆదిశేషు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్యామల పాల్గొన్నారు.



జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టిడిపి నేతలు

గూడెంలో జగన్ దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

బుధవారం జంగారెడ్డిగూడెంలో నారా లోకేష్ దిష్టిబొమ్మను గాడిదపై ఊరేగించినందుకు నిరసనగా గురువారం పట్టణంలో టిడిపి శ్రేణులు జగన్ దిష్టిబొమ్మను తగులబెట్టారు. లోకేష్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ఇటువంటి కార్యక్రమాలు చేస్తున్నారని, ఇది తగదని టిడిపి నాయకులు, కార్యకర్తలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి తాడేపల్లిగూడెం ఇన్‌ఛార్జి వలవల బాబ్జి, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - ఆకివీడు

ఈనెల 9న జాతీయ లోక్ అదాలత్ జరగనుందని, కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ లాయర్ బంటుమిల్లి సురేష్ కుమార్ సూచించారు. గురువారం దుంపగడప గ్రామ సచివాలయం వద్ద సామాన్య ప్రజలకు చట్టాలపై అవగాహన కలిగించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్యానల్ లాయర్ సురేష్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు సమన్యాయం పొందొచ్చన్నారు. గ్రామ వాలంటీర్లు ఈ విషయాన్ని ప్రచారం చేయాలని కోరారు. కక్షిదారులు తమతమ న్యాయవాదులను, సంబంధిత పోలీస్ వారిని లేదా సంబంధిత కోర్ట్ వారిని అర్జీ రూపంలో సంప్రదించి కేసుల నుండి విముక్తి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బి.సురేష్‌కుమార్, బి.లోకేశ్వరరావు, ఎస్ఐ ఫణి మోహన్, పారా లీగల్ వాలంటీర్ కృపావరం, దుంపగడప సర్పంచి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో రోటరీ క్లబ్ ముందంజ

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

సమాజంలో ఎటువంటి లాభాపేక్ష ఆశించకుండా సేవా కార్యక్రమాలు జరిపే స్వచ్ఛంద సంస్థల్లో పాలకొల్లు రోటరీ క్లబ్ ముందుందని ఉందని డిఎస్‌పి కె.రవిమనోహరాచారి అన్నారు. గొల్లవానిచెరువు గ్రామంలో గురువారం పాలకొల్లు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన మహిళలకు ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దారిద్య రేఖకు దిగువన ఉన్న పేద మధ్యతరగతి కుటుంబాల్లో ఆర్థికంగా ఎదిగేందుకు మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమం రోటరీ మాజీ అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ ప్రెసిడెంట్‌గా తన హయాంలో జరిగిన అనేక సేవా కార్యక్రమాల్లో ఇంత పెద్ద ఎత్తున కుట్టు మిషన్లు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. రూ.6 లక్షల విలువైన కుట్టుమిషన్లు మొదటిసారి 27 పంపిణీ చేయగా ఇప్పుడు రెండోదఫా 45 మందికి ఇస్తున్నామని చెప్పారు. అనంతరం మహిళలకు డిఎస్‌పి కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి ముత్యాల శ్రీనివాస్‌తో పాటు పలువురు రోటరీ ప్రతినిధులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఇమిడి రాజేష్, గ్రామ పెద్దలు పెనుమత్స ఏసురాజు, ఉప సర్పంచి బోళ్ల రామకృష్ణ, మానవత కన్వీనర్ ముత్యాల రామారావు, రోటరీ ఫాస్ట్ గవర్నర్ చందక రాము, రోటరీ అధ్యక్షుడు పెనుమాక రామ్మోహన్ పాల్గొన్నారు.

పెదఅమిరంలో గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి - కాళ్ల




లబ్ధిదారునికి సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న నరసింహరాజు

ప్రతిపక్ష పార్టీ టిడిపికి చెప్పుకోవడానికి ఏమి లేకపోవడంతో ఉండి ఎంఎల్ఎ ఇంటింటికీ వెళ్లి కంచాలు ఇచ్చి దండం పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. పెదఅమిరంలో గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం మూడో రోజు గురువారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలపై నరసింహరాజు ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడారు. టిడిపి చెప్పే అబద్ధపు మాటలు నమ్మొద్దన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ప్రజాదరణ పొందుతోందన్నారు. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు, వైసిపి గ్రామ అధ్యక్షులు వేగేశ్న జయ రామకృష్ణంరాజు, వైసిపి మండల కన్వీనర్ గణేశ్న రాంబాబు, వైసిపి నాయకులు జవ్వాది సత్యనారాయణ పాల్గొన్నారు.

సమిష్టి కృషితో విజయం : ఎంపీ మిథున్ రెడ్డి

ప్రజాశక్తి - పాలకొల్లు



మాట్లాడుతున్న ఎంపీ మిథున్ రెడ్డి

పాలకొల్లు అసెంబ్లీ నియోజకవర్గంలో నేతలు విబేధాలు లేకుండా సమిష్టిగా కృషి చేస్తే పాలకొల్లులో వైసిపి జెండా ఎగురవేయడం ఖాయమని వైసిపి గోదావరి జిల్లాల సమన్వయకర్త, ఎంపీ మిథున్‌రెడ్డి కోరారు. స్థానిక అడబాల గార్డెన్స్‌లో గురువారం జరిగిన పాలకొల్లు అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రికెట్ టీం వలే విభేదాలు విస్మరించి పనిచేస్తే పాలకొల్లులో క్రికెట్ కన్నా పెద్ద టీం ఉందని చెప్పారు. పార్టీ జెండా ఎగురవేశాక అందరికీ న్యాయం చేసే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. గతంలో చిరంజీవిపై పార్టీ, కుల భేదాలు లేకుండా కాంగ్రెస్‌ను గెలిపించిన ఘనత పాలకొల్లు ప్రజలదని చెప్పారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ 1999లో చిరంజీవిపై ఉషారాణి నెగ్గిందని, మరలా అటువంటి గెలుపు పాలకొల్లులో ఖాయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మార్గాని భరత్, ఎంఎల్‌సిలు కవురు శ్రీనివాస్, కుడుపూడి సూర్య నారాయణ, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు పాల్గొన్నారు.

వైసిపిలో చేరికలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం సుమారు 100 మంది నీలాద్రిపురం గ్రామానికి చెందిన కార్యకర్తలు టిడిపి నుంచి వైసిపిలో చేరారు. డిప్యూటీ సిఎం కొట్టు వైసిపి కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పరిపాలన నచ్చి వైసిపిలోకి చేరడం శుభ సూచకమన్నారు. ఎంతో కాలంగా టిడిపిలో ఉన్నా ప్రజలకు దానివల్ల ఒరిగేదేమీ లేదని గ్రహించి స్వచ్ఛందంగా వైసిపిలో చేరారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ముత్యాల ఆంజనేయులు, వైసిపి నాయకులు కొట్టు విశాల్, ముప్పిడి సంపత్‌కుమార్, జిడ్డు హరిబాబు పాల్గొన్నారు.

టిడిపి విజయమే లక్ష్యంగా పనిచేయాలి

ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పోడూరు

వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయమే లక్ష్యంగా పని చేయాలని పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. మండలంలోని వద్దిపర్రు, రావిపాడు, పెనుమదం, మట్టపర్రు గ్రామాల్లో టిడిపి సాధికార మిత్ర, సేవా మిత్రా తెలుగు యువత ఐటిడిపి సభ్యులతో ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు గురువారం సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం కోసం, పార్టీ బలోపేతానికి చేయాల్సిన కృషి, తీసుకోవాల్సిన చర్యల గురించి సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, వద్దిపర్రు, మట్టపర్రు సర్పంచులు వడ్లపాటి రాజేంద్రప్రసాద్, దొమ్మేటి శ్రీనివాస్, ఎంపిటిసి సభ్యులు శారద పాల్గొన్నారు.

టిడ్కో కాలనీలో వీధిలైట్లు ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు నియోజకవర్గంలోని టిడ్కో ఇళ్ల వద్ద వీధి లైట్లను గురువారం రాత్రి బటన్ నొక్కి రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ప్రారంభించారు. టిడ్కో గృహాల్లో మౌళిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఆయన వెంట పాలకొల్లు ఇన్‌ఛార్జి గుడాల గోపి, వైసిపి నేతలు చెల్లెం ఆనంద ప్రకాష్, గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ పాల్గొన్నారు.

వీధి లైట్లను ప్రారంభించి మాట్లాడుతున్న ప్రసాదరాజు



భోజనశాల నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - ఉండి

పాఠశాలలోని భోజనశాల నిర్మించేందుకు తన వంతు సహకారంగా 10,000 రూపాయలు విరాళం అందిస్తున్నట్లు విశ్రాంత జవాన్, మానవత మండల మాజీ అధ్యక్షులు దంగేటి రామలింగేశ్వరరావు తెలిపారు. చెరుకువాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాఠశాల వరండాలో భోజనాలు చేస్తూ ఇబ్బందులు పడడంతో వారికి కావాల్సిన భోజనశాల నిర్మించేందుకు తనవంతు సహకారంగా 10 వేల రూపాయలను అందించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిఒ 107, 108ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పేద మెరిట్ విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకు తీసుకొచ్చిన జిఒ 107, 108ను రద్దు చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్.సుందర్, టి.అప్పలస్వామి డిమాండ్ చేశారు. గురువారం డిఎన్ఆర్ కళాశాల కూడలిలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టి.అప్పలస్వామి, సిహెచ్ సుందర్ మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా ఏర్పడ్డ ప్రభుత్వ వైద్య కళాశాలలో 50 శాతం ఎంబిబిఎస్ సీట్లను కన్వీనర్ కోటాలో కేటాయించి మరో 50 శాతం సీట్లను బి, సి కేటగిరీలుగా విభజించి లక్షల రూపాయలకు అమ్ముతూ ఈ ప్రభుత్వం వైద్య విద్యను పూర్తిస్థాయిలో వ్యాపారం చేసిందని విమర్శించారు. ఇలా చేయడం వల్ల ఎస్‌టి, ఎస్‌సి, బిసి, మైనార్టీ విద్యార్థులకు రిజర్వేషన్ ప్రాతిపదిక కేటాయించే వైద్య సీట్లు దగ్గే ప్రమాదముందని తెలిపారు. ఆపై ఈ వర్గాల విద్యార్థులు వైద్య విద్యకు దూరమౌతారన్నారు. 100 శాతం సీట్లను కన్వీనర్ కోటాలోనే భర్తీ చేయాలని వైద్య విద్యను, వ్యాపారం చేయడం కోసం తీసుకొచ్చిన జిఒ 107, 108ను తక్షణం రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కారుమంచి మనోజ్, పి.పవన్, అంజి పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పరిశీలన

ప్రజాశక్తి - ఉండి

గ్రామాభివృద్ధికి వైసిపి ప్రభుత్వం కట్టుబడి ఉందని యండగండి గ్రామ సర్పంచి గోగులమండ చిన్న కృష్ణమూర్తి అన్నారు. యండగండి గ్రామంలోని దళితవాడలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను చిన్న కృష్ణమూర్తి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వం నిధులు, జిల్లా పరిషత్ నిధులు సుమారు 28 లక్షల రూపాయలతో డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు సహకారంతో దళితవాడలో అవసరమయ్యే సీసీ రోడ్లు నిర్మించడం అభినందనీయమన్నారు. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా వైసీపీ ప్రభుత్వం పని చేస్తోందన్నారు.

టిడిపితోనే ప్రజలకు లబ్ధి : ఎంఎల్ఎ రామరాజు

ప్రజాశక్తి - ఉండి

టిడిపి అధికారంలోకి వస్తే ప్రజలకు ఎక్కువ లబ్ధి చేకూరుతుందని ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. గురువారం సాయంత్రం ఆరేడు గ్రామంలో ఇంటింటికీ మన టిడిపి ఇంటింటికీ మన రాంబాబు కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ రామరాజు మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరట్లేదని, కరెంటు బిల్లులను కొలమానంగా తీసుకుని సంక్షేమ పథకాలను ప్రభుత్వ అందిస్తోందని ఇది సమంజసం కాదని తెలిపారు. అనంతరం సిఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల స్థాయి, గ్రామ స్థాయి నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన అసిస్టెంట్ సెక్షన్ అధికారులు

ప్రజాశక్తి - భీమవరం

కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని కేంద్ర ప్రభుత్వ వివిధ మంత్రిత్వ శాఖల్లో పనిచేస్తున్న అసిస్టెంట్ సెక్షన్ అధికారులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీస్ 2021 బ్యాచ్ (గ్రూప్ 294 ఏ) అండర్ ఫౌండేషన్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ వివిధ మంత్రిత్వ శాఖల్లో అసిస్టెంట్ సెక్షన్ అధికారులుగా పనిచేస్తున్న బసుదేవ్‌దేవ్, హేమంత్ కుమార్, హిమన్ష్ సైని, మయంక్ అగ్రావల్, నిశికాంత్, విశాల్ కలెక్టర్‌ను కలిశారు. ట్రైనింగ్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలు ఏవిధంగా అమలు జరుగుతున్నాయని తెలుసుకునేందుకు జిల్లాలో విస్సాకోడేరు, మొగల్తూరు, శేరేపాలెం తూర్పుతాళ్ళ, పెదమైనవానిలంక, మోగల్లు గ్రామాలను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేడిద నవీన్ కిరణ్ సహకారంతో ఇటీవల పర్యటించారు. వారి వెంట మొగల్తూరు మండలం ఇఒపిఆర్‌డి, నోడల్ అధికారి ఎం.నవీన్ కిరణ్, పంచాయతీ సెక్రటరీ ఎస్.కిషోర్, గోపాలన్ కృష్ణంరాజు ఉన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - పోడూరు

డెంగీ జ్వరాలు ప్రబలకుండా ప్రజలను చైతన్య పరిచేందుకు మండలంలోని వద్దిపర్రు వెల్‌నెస్ సెంటర్ సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం ఇంటింటా సర్వే నిర్వహించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎవరికైనా దగ్గు, జ్వరం, రొంప, తలనొప్పి వంటివి వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆరోగ్య సిబ్బందిని కలిసి వైద్య సహాయం తీసుకోవాలని తెలిపారు. అంటువ్యాధులు ప్రబలకుండా ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనారోగ్యంతో బాధపడుతున్నవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి అనిత, హెల్త్ అసిస్టెంట్ డి.వెంకటరత్నం, ఆశా వర్కర్ రాపాక విజయలక్ష్మి పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా మొక్కల పంపిణీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా గురువారం మార్టేరులో జనసేన ఉమ్మడి పగో జిల్లా జాయింట్ సెక్రటరీ షేక్ ముంతాజ్ బేగం ఆలీ ఆర్థిక సహాయంతో మార్టేరు ఎస్‌విజిహెచ్ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులు చిర్ల సూర్యనారాయణ రెడ్డి, వ్యాయమ ఉపాధ్యాయులు కర్రి కృష్ణారెడ్డి సమక్షంలో కొబ్బరి మొక్కలు పంపిణీ చేసి నాటారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉమ్మడి జిల్లా సెక్రటరీ చిట్టూరి శ్రీనివాస్, మండల కార్యవర్గ సభ్యులు వినుకొండ తేజష్, రామానాయుడు, పట్నాల రావి పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పాలకొల్లు

అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాలలో తెలుగు, మాథ్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, ఎంఎస్‌సి, ఆక్వాకల్చర్ సబ్జెక్టుల్లో అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ కనీసం 55 శాతం పైగా మార్కులున్న వారు అర్హులని తెలిపారు. పిహెచ్‌డి, నెట్, ఎపి సెట్ బోధధన అనుభవం కలిగి ఐసిటి టూల్స్ ద్వారా ఆన్‌లైన్ విధానం ద్వారా బోధించే అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే ఒక కంప్యూటర్ ఆపరేటర్ కావాలని తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులు, సర్టిఫికెట్లతో ఈ నెల 6వ తేదీలోపు కళాశాలలో అందజేయాలని తెలిపారు.

తహశీల్దార్ కార్యాలయానికి కంప్యూటర్లు అందజేత

ప్రజాశక్తి - పెనుమంట్ర

తమ కార్యాలయంలో విధులు నిర్వహించుకునేందుకు వీలుగా దాత కంప్యూటర్లు అందజేయడం అభినందనీయమని తహశీల్దార్ దండు అశోక్‌వర్మ అన్నారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో వెలగలవారిపాలెం చెందిన తాడి రాజారెడ్డి రూ.50 వేల విలువ చేసే రెండు కంప్యూటర్లు, ఒక ప్రింటర్ బహూకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాజారెడ్డికి రెవెన్యూ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఐ.ఎ.నెం. 542/2019, ఓ.ఎస్.నెం. 24/2014

బిట్వీన్:

శ్రీమతి బుర్రా పూర్ణిమ
...పిటీషనరు /ప్రపోజ్డ్ పార్టీ

అండ్

రాట్నాల శ్రీనివాసరవు వగైరా
...వాది /రెస్పాండెంట్లు

టు:

ఆర్-8: మెరగాని పావని శ్రీలత, భర్త: శ్రీనివాసు, వయస్సు 42 సం॥లు, స్త్రీధనం.

ఆర్-9: కామినేని మీనామాన్వి, వయస్స 25 సం॥లు, స్త్రీ ధనం.

ఆర్-10: మెరగాని హితైషి, తండ్రి: లేటు శ్రీనివాసరావు, వయస్స 22 సం॥లు, సా॥8-10, ఫ్లాట్ నెం.302, భాస్కర హైట్ అపార్ట్‌మెంట్, విద్యా నగర్, ఏలూరు ఇ.జె.సి.జె.

పై నెంబరు పిటీషనులో పిటీషనరు ప్రతివాదిగా చేర్పించమని కోరగా సదరు పిటీషనులో మీకు ఎన్ని సార్లు నోటీసులు పంపించిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. సదరు పిటీషను శ్రీ కోర్టు వారు **ది.04-09-2023 సం॥రం తేదీకి వాయిదా వేసినారు. ఆరోజున మీరు స్వయంగా గాని, వకీలు గారి ద్వారా గాని ఉదయం గం॥10:30 ని॥లకు కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను.** లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

పి.జె.పి. కెనడి
పిటీషనరు తరుపు అడ్వకేట్,
బాతనీపేట, భీమవరం.
సెల్: 93473 04911

భీమవరం,
30-8-23.